ప్రజాశక్తి
ఆదివారం 23 మార్చి 2025

మిల్లెట్ మేళాలో ప్రారంభిస్తున్న బి.జనార్ధన్‌రెడ్డి

సహజ వ్యవసాయంతో

ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా

మిల్లెట్ మేళా ప్రారంభ సభలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో సహజ వ్యవసాయంతోనే ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసాగా ఉంటుందని పలువురు వక్తలు తెలియజేశారు. అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న మిల్లెట్ మేళా శనివారం అనంతపురం నగరంలో ప్రారంభమైంది. పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా స్థానిక రకాల పంటలను పండించడమే ఏకైక పరిష్కారమని, రాబోయే కాలంలో ఆహార, ఆదాయ భద్రతను కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని "మన వ్యవసాయం, పంటలు, వంటకాలు, ఆరోగ్యం" ప్రారంభోత్సవంలో వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతపురం పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో అనంతపురం మాజీ కలెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.జనార్ధన్‌రెడ్డి, ఎన్ఐఆర్‌డి డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి, జమ్ముకాశ్మీర్ మాజీ డిజిపి గోపాల్‌రెడ్డి, ఎపి మాస్ సిఇఒ ఎండి సిఎస్.రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కలెక్టర్ జనార్ధన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లు నేపథ్యంలో ఊబకాయం పెరుగుతోందన్నారు. ఇవి ఆరోగ్యాలపైన తీవ్ర ప్రభావాలు చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు చిరుధాన్యాలను విరివిగా తీసుకోవడం అలవర్చుకోవాలన్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల నిపుణులు విజయరామ్ ముఖ్య అతిథిగా మాజరై మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంట సాగును ప్రోత్సహించాలన్నారు. సహజ సాగు సూత్రాలను అనుసరించి ఎకరానికి రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఆర్థిక భద్రత కల్పించవచ్చన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడంతో పాటు రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పించవచ్చన్నారు. రసాయనిక పద్ధతుల్లో పండించిన పంటలతో అనార్థాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సాగు దిశగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి అనంతపురంలో జరుగుతున్న మిల్లెట్ మేళా ఉద్దేశాన్ని వివరించారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో పాటు వినియోగంపైనా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు తమ వంతు తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ, ఇతర అధికారులు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా నలుమూలల నుంచి సుమారు 800 మంది రైతులు పాల్గొన్నారు.

మిల్లెట్ వంటల కేక్‌ను కట్ చేస్తున్న అతిథులు



పట్టులో ఉద్యోగోన్నతుల సిరులు..!

- పోస్టింగ్.. ఉద్యోగోన్నతుల్లో చేతులు మారుతున్న నగదు
- డబ్బులిస్తే కోరుకున్న చోట పోస్టింగ్..
- బయటకు చెప్పకూడదని విఎస్‌ఎలకు అధికారుల ఆదేశాలు.?

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ పట్టు పరిశ్రమ సహాయకుల ఉద్యోగోన్నతులు పట్టు పరిశ్రమ శాఖలో కొందరు ఉద్యోగులకు సిరులు కురిపిస్తున్నాయనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఏకంగా రూ.కోటి వరకు మామూళ్లు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఉద్యోగోన్నతికి ఒక రేటు... పోస్టింగ్‌కు ఒక రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో కలెక్టర్, ప్రత్యేక అధికారులతో విచారణ చేపడితే అవినీతి బాగోతం బయటపడే అవకాశాలు ఉన్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

గత ప్రభుత్వం గ్రామస్థాయిలో వ్యవసాయంతో పాటు పట్టు పరిశ్రమలో సైతం రైతులకు సహాయ సహకారాలు అందించి వ్యవసాయం, పట్టు పరిశ్రమను అభివద్ధి చేయాలని రైతు భరోసా కేంద్రాలను గ్రామస్థాయిలో ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. ఇందులో విధులు నిర్వహిస్తున్న గ్రామ పట్టు పరిశ్రమ సహాయకులు (విలేజ్ సిరికల్చర్ అసిస్టెంట్)లను సాంకేతిక సహాయకులుగా (టెక్నికల్ అసిస్టెంట్)గా ఉద్యోగోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 140 మందికి ఉద్యోగోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సుమారు 66 మందికి ఉద్యోగోన్నతులు కల్పించాలని జిల్లా పరిశ్రమ అధికారులు ఫైల్ సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదికను అందించారు. విఎస్ఎ నుంచి టెక్నికల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలంటే గతంలో నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కులు మెరిట్ ఆధారంగా రోస్టర్ పాయింట్‌లను అనుసరించాల్సి ఉంది. ఈ నిబంధనలను గాలికి వదలి రాప్తాడు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఒక విఎస్ఎ ప్రధాన పాత్ర పోషించి ఉద్యోగోన్నతి కోసం ఒక్కో ఉద్యోగి నుంచి రూ.40 వేలు వసూలు చేశారని సమాచారం. వారు కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వడానికి రూ.2 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు సైతం అతని మధ్యవర్తిత్వంతోనే ఉద్యోగోన్నతులు, పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

కోర్టులో ఉన్నా కలెక్టర్ వద్దకు ఫైల్..!

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పట్టు పరిశ్రమ శాఖలో సాంకేతిక సహాయకులుగా కల్పించిన ఉద్యోగోన్నతులలో తమకు అన్యాయం జరిగిందని శ్రీరాములు నాయక్, బి. రాధకృష్ణ, జి.ప్రసాద్‌లు గత సంవత్సరం హైకోర్టును ఆశ్రయించారు. అనంతపురం, పుట్టపర్తి జిల్లాల పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ఈ నెల 19న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 69 మంది విఎస్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తు ఫైల్‌ను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ విషయం కోర్టులో ఉన్నప్పటికీ వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఫైల్ పంపడం గమనార్హం.

పారదర్శకత పాటించాం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ పట్టు పరిశ్రమ సహాయకుల ఉద్యోగోన్నతులను పూర్తి పారదర్శకంగా వ్యవహరించి జాబితాను సిద్ధం చేశాం. ఇందులో ఎటువంటి ఒత్తిళ్లు, అవకతవకలు జరగలేదు. మెరిట్, రోస్టర్ పాయింట్లు తీసుకుని, జాబితాను ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఉద్యోగోన్నతుల జాబితాను కలెక్టర్‌కు పంపాం. డబ్బుల వసూలు చేసిన విషయం తమకు తెలియదు. రోస్టర్ పాయింట్లలో తమకు అన్యాయం జరిగిందని పలువురు కోర్టుకు వెళ్లిన విషయం సైతం తమకు తెలియదు.

పద్మమ్మ, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి, పుట్టపర్తి.

నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు

అకాల వర్షం.. నేలకొరిగిన పంట.!

ప్రజాశక్తి-తనకల్లు

మండల కేంద్రంలో శనివారం కురిసిన అకాల వర్షానికి పంట నేలకొరిగింది. ఈదురుగాలి, వర్షం రావడంతో మండల కేంద్రంలోని తారకరామ నగర్‌కు చెందిన రైతు ఎగవిండ్ల ఆంజనేయులుకు చెందిన మొక్కజొన్న పంటను పూర్తిగా నేలమట్టం అయ్యింది. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షంతో పంట నేలకూలడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మండల వ్యవసాయ అధికారులు స్పందించి పంట నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరాడు.

కనుల పండువగా తీర్థవాది ఉత్సవం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి శ్రీ లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 14వ రోజు శనివారం ఉదయము శ్రీదేవి భూదేవి సమేతం శ్రీవారికి తీర్థవాది ఉత్సవం నిర్వహించారు. భృగు తీర్థం (కోనేరు)లో శ్రీవార్లకు అబిషేకం, చక్రస్నానం చేయించారు. అనంతరం దేవస్థానంలో స్వామి ధ్వజస్థంభానికి కట్టిన కంకణాన్ని తొలగించారు. స్వామివారికి ప్రత్యేక పుష్ప అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థవాది భక్తిశ్రద్ధలతో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆర్డీవో వివిఎస్.శర్మ, సంబంధిత అధికారులు, ఉభయదారులు పాల్గొన్నారు.

తీర్థవాది ఉత్సవంలో శ్రీదేవి భూదేవితో శ్రీవారు

ఉపకారాగారం తనిఖీ

ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఉపకారాగారాన్ని సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జైలు జీవితం అనుభవించడం వల్ల కుటుంబాల గౌరవ మర్యాదలు దెబ్బతింటాయని, జైలు నుంచి బయటకు వెళ్లాకా నేరాల జోళికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార అధికారి హనుమన్న, న్యాయవాదులు కళావతి, సంతోషి కుమారి, అబ్దుల్లా, భరత సింహ, లోక్ అదాలత్ సిబ్బంది శారద పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసేందుకే నిధుల కోత

- కూలీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష
- వ్యవసాయ కూలీల సమస్యలపై మే 20న గ్రామీణ హర్తాల్
- వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఎంతో భరోసాగా ఉపాధి హామీకి నిధులు కేటాయించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రల చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ ప్రభుత్వాల తీరును నిరసిస్తూ వ్యవసాయ కార్మికులకు విరివిగా ఉపాధి పనులను చూపాలని, కూలి రేట్లు పెంచాలనే తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ హర్తల్‌ను మే 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలోని వ్యకాసం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు మేలు చేసేదిలా ఉందన్నారు. ఉపాధి హామీకి సంబంధించి నిధులు తగ్గించారన్నారు. రాష్టంలోని కూటమి ప్రభుత్వం విజన్ - 2047 డాక్యుమెంట్ పేరుతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేస్తామంటూ గొప్పలు చెబుతోందన్నారు. ఈ విజన్ 2047 డాక్యుమెంట్‌లో 1.20 కోట్ల మంది వ్యవసాయ కార్మికుల గురించి ప్రస్తావన లేకపోవడం విచాకరం అన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించకుండా, వారిని అభివృద్ధి చేయకుండా విజన్ 2047 అంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా లాంటి కరువు జిల్లాలో వ్యవసాయ కార్మికులు ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకొని సుదూర ప్రాంతాలకు వలసలు వెళు_న్నారన్నారు. ఇలా వలస వెళ్లే క్రమంలో కూలీలు రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలసల నివారణకు ప్రభుత్వం చెబుతున్న మాటలు ఆచరణలో కన్పించడం లేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికులు అందరికీ ఉపాధి పనులు కల్పించి సంవత్సరానికి 200 పని రోజులు కల్పించాలన్నారు. రోజుకు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ఉపాధికి నిధులు పెంచాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపుమేరకు మే 20వ తేదీన జరిగే గ్రామీణ హర్తాల్ నిరసన కార్యక్రమాల్లో జిల్లాలోని కూలీలందరికీ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు రమాదేవి, స్వర్ణలత, నారాయణ, బెస్త కిష్టప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

25న కదిరిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్/కదిరి

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో ఈ నెల 25వ తేదీ కదిరి మున్సిపాలిటీ పరిధిలోని బ్లూ మూన్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత ఎం.శివశంకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటరెడ్డి శనివారం వేర్వేరు పత్రికా ప్రకటనల్లో తెలిపారు. వారు మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో సుమారు 25 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొం టాయని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తార న్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, ఏదేని డిగ్రీ, బీటెక్, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10వేల నుంచి రూ. 40వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9390176421, 9182288465 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి : ఎస్ఇ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించి సంస్థ అభివద్ధికి సహకరించాలని ఎస్ఈ సురేంద్ర కుమార్ తెలిపారు. ఆయన శనివారం జిల్లా విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ. 300 కోట్లు ఉన్నాయని, ప్రభుత్వం విడతల వారీగా ఆ మొత్తాన్ని మంజూరు చేస్తుందన్నారు. రూ. 17 కోట్లు ప్రయివేట్ నుంచి వసూలు చేయాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 200 యూనిట్లు దాటిన వారు బిల్లులు చెల్లించాలన్నారు. ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పిస్తామన్నారు. పిఎం సోలార్ విద్యుత్ పథకం కింద సబ్సిడీ ఉందని ఈ పథకాన్ని వినియోగించుకుంటే చాలా వరకూ విద్యుత్ ఛార్జీల భారం తగ్గుతుందన్నారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఒక టీం పని చేస్తుందన్నారు. అధిక లోడ్ విద్యుత్ వాడుతున్న వారు కూడా ఖచ్చితంగా ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం : డీఎస్పీ

కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ, మున్సిపల్ ఛైర్మన్ తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని హిందూపురం డీఎస్పీ వికె.మహేష్, మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని సప్తగిరి ఎంబిఎ, ఎంసిఎ కళాశాలలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ ఫెస్టివల్ జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన భవిష్యత్తును గుర్తించుకుని విద్యను అభ్యసించాలన్నారు. బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎంబిఎ, ఎంసీఏ కోర్సులు జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి, కళాశాల పాలనాధికారి గంగిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రపై ఆంక్షలు తగదు : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

హజ్‌యాత్రపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడం తగదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి ఆరోపించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హాజ్ యాత్రపై కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు సరికాదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అనంతపురం ఉమ్మడి జిల్లాకు 2500 మందికి హాజ్ యాత్ర కు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం 97 మందికి మాత్రమే అనుమతులు ఇవ్వడం చూస్తే కూటమి ప్రభుత్వానికి ముస్లిములపై ఏపాటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హజ్‌యాత్ర ఎంబార్కేషన్ పాయింట్‌ను రాష్ట్రంలో లేకుండా చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. ఇలాంటి వాటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షులు చాంద్ బాషా, రాష్ట్ర కురుబ వర్కింగ్ అధ్యక్షులు శివ, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, కౌన్సిలర్ నాగరాజు, 32 వార్డ్ ఇన్‌ఛార్జి హుమయూన్, సహేరా బాను, ఇనాయత్, ఆసిఫ్, నూరుల్లా, సాదిక్, సఫివుల్లా, రఫీక్, సుహేల్, రజాక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి

హంద్రీనీవా లైనింగ్ పనులు నిలిపేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

రైతులకు నష్టం కలిగించే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే నిలుపుదల చేసి కాలువను వెడల్పు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం సమీపంలోని హంద్రీనీవా కాలువను పరిశీలించి మాట్లాడారు. గతంలో హంద్రీనీవా కాలువలో 3 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేదని, లైనింగ్ పనులతో నీటి ప్రవా హం పూర్తిగా తగ్గి భూగర్భ జలాలు తగ్గిపోతాయని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కాలవలోని పిచ్చిమొక్కలు తొలగించి కాలువలను వెడల్పు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపి సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. లైనింగ్ పనులను ఆపి, కాంట్రాక్టు రద్దు చేసి పంట కాలువ నిర్వహణ పనులను ప్రయివేట్ ఏజెన్సీకి ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలన్నారు. అలాగే ఎన్‌హెచ్-342 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బ్యాల్ల అంజి, కుళ్లాయప్ప, సిద్ధు, పాల్గొన్నారు.

ఉషోదయ పాఠశాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉషోదయ ప్రైవేట్ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి గంగప్పను కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, చంద్రశేఖర్, నందీష్‌లు మాట్లాడుతూ ఉషోదయ పాఠశాల నిర్వాహకులు ఒంటిపూట బడుల నిర్వహణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎండలు మండుతున్నా సాయంత్రం 3.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతోందన్నారు. అధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిని ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పిల్లల బాధ్యత అందరిది : డీఎస్పీ

ప్రజాశక్తి-పెనుకొండ

పిల్లలు హింసాత్మక సంఘటనలకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలోని భువనవిజయం సమా వేశ భవనంలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ, మిషన్ వాత్సల్య/డిసిపియు, చిల్డ్రన్ ఆఫ్ ఇండి యా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'పిల్లలు ఆన్‌లైన్‌లో హింసాత్మక సంఘటనలకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యలు'పై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరన డీఎస్పీ న్యాయం, చట్టం, బాల్య వివాహాల నిలుపుదల, శిశుగృహ దత్తత, తదితర అంశాలపై చర్చించారు. సమస్యలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి నిర్మూలించాలని మహిళా పోలీసులకు సూచించారు. సిడిపిఒ శాంతలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న స్కూల్స్ విజిట్ చేసి దుర్భర పరిస్థితుల్లో ఉన్న పిల్లలు, ఒంటరి తల్లిదండ్రులు ఉన్న పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిసిపిఒ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్, సోషల్ వర్కర్ వనజాక్షి, శిశు గృహ మేనేజర్ సునీత, లక్ష్మీప్రసన్న, పవన్, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మిషన్ వాత్సల్యపై అవగాహన

బుక్కపట్నం : తల్లిదండ్రుల గారాభమే పిల్లల పాలిట శాపంగా మారుతోందదని సిఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయం లో చిల్డ్రన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ వర్కర్లు, వివో లీడర్లు, మండల సమాఖ్య లీడర్లు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం రవీంద్రారెడ్డి, డిసిపియు సోషల్ వర్కర్ వనజాక్షి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆ సేవా కార్యక్రమాలేవీ.?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీపంలో ఉంటే మాత్రం రాజకీయ నాయకుల హడావుడి అంతాఇంతా ఉండదు. ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో సందడి నడుస్తుంది. గతేడాది సరిగ్గా ఇదే సమయంలో ఎన్నికలుండగా చూస్తే పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నడిచాయి. ప్రధానంగా వేసవి వచ్చిందంటే చాలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎక్కడ చూసినా వారితోపాటు, వారి అనుయాయుల పేర్ల మీద చలివేంద్రాలు వెలిసేవి. మజ్జిగ పంపిణీ కేంద్రాలు కూడా కొన్ని చోట్ల నడిచాయి. ఇప్పుడు చూస్తే మార్చి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఈ వారంలో గరిష్టంగా 41.1 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత చేరింది. ఇంతటి తీవ్రత ఉన్నా చలివేంద్రాలు చూస్తే అక్కడక్కడ తప్ప పెద్దగా ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. కనీసం తాగునీటి సమస్యల పరిష్కారం కోసం నేతలు చేసిన ప్రయత్నాలు కూడా పెద్దగా కనిపించడం లేదు. ఇప్పటికే భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. అనేక గ్రామల్లో నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమయంలో రంజాన్ మాసం నడుస్తోంది. ఎన్నికల సమయంలో అయితే నేతలు పెద్దఎత్తున ఇఫ్తార్ విందులుచ్చేవారు. మైనార్టీలు అధికంగానున్న చోట ఇవి మరింత ఎక్కువగా ఉండేవి. ఈసారి ఇఫ్తార్ విందులిచ్చిన నేతలు నామమాత్రంగానే ఉన్నాయి. మాజీ జెడ్పీ ఛైర్మన్ చమన్ సాబ్ కుమారుడు ముఖ్తియర్ విందు ఇచ్చిన వారిలోనున్నారు.

ఈ వారంలో ప్రధానంగా ముందు కొచ్చిన సమస్యల్లో ఉపాధి హామీ సమస్యలు ప్రముఖంగా ఉన్నాయి. వేసవి కాలం కావడంతో వ్యవసాయ పనుల్లేవు. ఇటువంటి సమయంలో వ్యవసాయ పనులను చేపట్టాల్సి ఉంది. జిల్లాలో అక్కడక్కడా ప్రారంభమైనా బిల్లుల చెల్లింపుల్లో తీరని జాప్యం జరుగుతోంది. పది వారాల వరకు కూడా చేసిన పనికి బిల్లులు రావడం లేదు. వ్యవసాయ కార్మికుల సమస్యలను తెలుసుకునేం దుకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జిల్లాలో స్కూటర్ ర్యాలీలతోపాటు, సచివాలయాల్లో అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. కాని ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటికీ బిల్లుల చెల్లింపులు జరగలేదు. ఈ వారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు జిల్లా పర్యటన చేశారు. సోలార్ పార్కుల పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి ఏ మేరకు లభిస్తోంది. రైతులకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుతోందని పరిశీలించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా రైతులకు చేకూరుతున్న ప్రయోజనం తక్కువని ఆయన చెప్పారు. ఏడాదికి రూ.31 వేలు కాకుండా నెలకు రూ.30 వేలు లీజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు జిల్లాలో పెద్ద ఎత్తున సోలార్, విండ్ పరిశ్రమలు మంజూరవుతున్నాయి. సుమారు లక్ష ఎకరాల వరకు భూములను వీటి కోసం సేకరించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇంత పెద్దఎత్తున భూములు రైతుల నుంచి పోతుండటంపై చాలా మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సోలార్ వలన గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలెందుకు..?

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రజల సమస్యలు పట్టని ప్రభుత్వాలు ఎందుకని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. సిపిఎం నాయకులు ఆలకుంట మారుతి, ఎస్.హెచ్.బాషా, టి.అయూబ్‌ఖాన్, హరి శనివారం స్థానిక వైఎస్ఆర్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఈ కాలనీ ఏర్పడి 20 ఏళ్లయినా రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, తదితర మౌలిక వసతులు కల్పించకపోవడం ప్రజాప్రతి నిధులు, అధికారుల అసమర్థతకు నిదర్శనమన్నారు. పది రోజులకు ఓ సారి కూడా తాగునీరు రావడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారన్నారు. కాలనీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఖాదర్‌బాషా, హైదర్‌వలి, వెంకటస్వామి, మహబూబ్‌పీరా పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

ఓపెన్ 'పది' పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా శనివారం 38 కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలకు 99.85 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు ఇద్దరు, ప్రయివేట్ విద్యార్థులు ఐదుగురు గైర్హాజరయ్యారన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు సత్రశాల ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో వైద్యనిపుణులు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

నేడు వృద్ధులకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని ధర్మపురి గ్రామ ఎంపియుపి పాఠశాలలో ఆదివారం వృద్ధుల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంపు ఆర్గనైజర్ డాక్టర్ సత్యనిర్ధారన్ తెలిపారు. శిబిరంలో నేత్ర, దంత, వివిధ రకాల జబ్బులకు ఉచితంగా చికిత్స చేస్తారని తెలిపారు. డాక్టర్ సత్యనిర్ధారన్ మాట్లాడుతూ ధర్మవరం ఎన్జీవోల సహకారంతో పదేళ్లుగా 'వృద్ధుల ప్రాధాన్యత వైద్య శిబిరాలు' నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల పెను కొండలో నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెహర్‌బాబా సెంటర్ అధ్యక్షురాలు సుజాతకు మహిళా శిరోమణి అవార్డు రావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగేంద్ర, మెహర్ బాబా సెంటర్ అధ్యక్షురాలు సుజాత, మెహర్‌బాబా వృద్ధుల వైద్య శిబిరం నిర్వాహకులు కృష్ణమూర్తి, బీరే శ్రీరాములు, హెచ్ఎం, ఉపాధ్యాయులు నాగరాజు విద్యా ర్థులు పాల్గొన్నారు.

నేడు ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహి స్తున్నట్లు ప్రిన్సిపల్ జి.వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 94802 34789 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-పావగడ

సమాజంలో తల్లిగా, చెల్లిగా, భార్యగా మహిళలు అన్ని పాత్రలు పోషిస్తున్నారని సీనియర్ సివిల్ జడ్జి వి.మాదేశ్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం తాలూకా లీగల్ సర్వీస్ కమిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మహిళ కుటుంబంలోని అందరి సభ్యుల సంరక్షణకు పాటుపడుతుందన్నారు. మహిళల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు హెచ్.శేషానందన్, ప్రిన్సిపల్ సివిల్ కోర్ట్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటివ్స్ అన్నీరప్ప, న్యాయవాది భారతి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

చేనేతలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఎన్నికల హామీ మేరకు చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై మంత్రి లోకేష్ జీవో జారీ చేయడం పట్ల సోమందేపల్లి తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరి హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద రంగమైన చేనేత వ్యవస్థను కరోనా కుదేలు చేయడంతో నేతన్న బతుకు అగమ్య గోచరంగా మారిందన్నారు. మంత్రి సవిత సహకారంతో నేడు రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ లభిస్తోందన్నారు. భవిషత్తులో నేతన్నలు నేసే చీరలకు గిట్టుబాటు ధర కల్పించి, చేనేత వ్యవస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని, వ్యక్తిగత రుణాలు మంజురు చేయించాలని, సొంతిల్లు నిర్మించి ఇచ్చేలా కృషి చేయాలని కోరారు.

సిసి హరి

భూ నిర్వాసిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలం మీదుగా ఏర్పాటు చేస్తున్న 342 హైవేకు భూములు కోల్పోయిన గుంజేపల్లి, మంగల మడక, నక్కలపల్లి, దొరిగల్లు గ్రామాల రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ శనివారం ముదిగుబ్బ రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారి సమస్యలపై ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, అందులో మండలంలోని రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ముదిగుబ్బ రైతు సంఘం అధ్యక్షులు పోతలయ్య, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్‌జాన్, బాబు, నాగప్ప, వెంకటనారాయణ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కుటుంబ సాధికార సారథి కమిటీని ఎంపిక చేయండి

ప్రజాశక్తి-పెనుకొండ

కుటుంబ సాధికార సారథి కమిటీ సభ్యులను బూత్‌ల వారీగా ఎంపిక చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథి కమిటీ ఎంపిక ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఓటరు జాబితా ప్రకారం ప్రతి 60 మందిలో ఓ పురుషుడు, ఓ మహిళను ఎంపిక చేసి బూత్‌ల వారీగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగులూరు నారాయణస్వామి, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, కౌన్సిలర్ హనుమంతు, అశ్వర్థనారాయణ, రఘువీరాచౌదరి, కురుబ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు

బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం జోలికెళ్లొద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి-తనకల్లు

యువత బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం జోలికెళ్లొద్దని ఎస్ఐ గోపి సూచించారు. యువత బెట్టింగ్, ఆన్‌లైన్ జూదాలకు దూరంగా ఉండాలని కోరుతూ శనివారం ఉదయం తనకల్లు మండల యువత ఆధ్వర్యంలో మండలంలోని కొక్కంటి క్రాస్ నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో బాలసముద్రం ఎంపిటిసి అమర్ కార్తికేయ, ఫయాజ్, బాలకృష్ణ, సోంపాల్యం అఖిల్, అశోక్, గణేష్, వినోద్, పాల్గొన్నారు.

బెట్టింగ్, ఆన్‌లైన్ జూదంకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టిన యువత

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు తగదు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కార్మికులపై వేధింపులకు పాల్పడడం తగదని హైకోర్టు న్యాయవాది, బహుజన సమాజ్ వేదిక వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ తెలిపారు. ఆయన శనివారం ఆర్టీసీ డిపోకు వెళ్లి కార్మికుల సమస్యలపై డిపో మేనేజర్ రామసుబ్బయ్యకు వినతిపత్రం ఇచ్చారు. డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని, లేనిచో భవిష్యత్తులో జరిగే ఆందోళన కార్యక్రమాలకు ఆర్టీసీ ఉన్నతాధికారులే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఆయన వెంట ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఉన్నారు.

డిపో సమస్యలపై డిఎం తో చర్చిస్తున్న హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ

25న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-నల్లచెరువు

సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ 'ఇళ్లు-ఇళ్ల పట్టాలు' పేరుతో కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల సిపిఎం, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. నల్లచెరువులో శనివారం వారు మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇవ్వటమే కాకుండా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

మండల సమావేశం నేటికి వాయిదా

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి తెలిపారు. 23వ తేదీ ఉదయం 11 గంట లకు సమావేశం నిర్వహిస్తామ ని, జడ్పీటీసీ, మండల కోఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖ అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలిపారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపంలో బెంగళూరుకు చెందిన ఎంఎస్.రామయ్య మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, డాక్టర్ ఆదిత్య కుమార్‌లు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన 35 మంది వైద్యులు 430 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నేతృత్వంలో వారందరికీ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సద్గురు యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, జనసేన నాయకులు ఆకుల ఉమేష్, రాజ్యలక్ష్మి మోహన్ పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న బాలాజీ, ఛైర్మన్ రమేష్ కుమార్

విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కౌన్సిలర్ మహాలక్ష్మి

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లి బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి నాగేంద్ర శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు.

పూడిక పనుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు సక్రమంగా తీయాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ ఆదేశించారు. శనివారం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని బైపాస్ రోడ్ పక్కన ఉన్న కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రెయినేజీలో నిల్వ ఉన్న చెత్తను పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు దుర్గా నవీన్, యుగంధర్, పారిశుధ్య కార్యదర్శి లలిత్ పాల్గొన్నారు.

పనులను పరిశీలన చేస్తున్న చైర్మన్ రమేష్ కుమార్

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం, ఒడిగేపల్లి పంచాయతీలకు చెందిన జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పాలసముద్రం క్రాస్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ముఖ్య అతిథిగా హాజరైన సిఐ బోయ శేఖర్ ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు జనసేనపార్టీ నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్, పొగతోట వెంకటేష్, అనిల్, శ్రీనివాసులు, రమేష్, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు వినతి

డిప్యూటీ సిఎంను కలిసిన పత్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ శనివారం కర్నూలు పర్యటనలో ఉన్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు జనసేనపార్టీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ వినతి పత్రం ఇచ్చారు. ముందుగా చంద్రశేఖర్ పవన్‌కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుట్టపర్తి నియోజక వర్గ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. యువత వలస వెళ్లకుండా ఉద్యోగ, ఉపాధి కల్పించేలా పరిశ్రమలు స్థాపించాలని కోరారు. అందుకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు పత్తి చంద్రశేఖర్ తెలిపారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

ప్రజాశక్తి-తలుపుల

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో సయ్యద్ షాదాబ్ సూచించారు. ఆయన శనివారం మండలంలోని ఓదులపల్లి, కుర్లి, ఉడములకుర్తి రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందేలా అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 11,730 మందికి గానూ 8,448 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు కూడా కచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-లేపాక్షి

కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం తహశీల్దార్ అధ్యక్షతన రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని రేషన్ కార్డుదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందించాలన్నారు. తూకాల్లో వ్యత్యాసం ఉండకూడదని, అధిక ధరలు వసూలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి నాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి

సీసీ టీవీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుక్కపట్నం

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్ యాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఇస్తున్న సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్‌హుస్సేన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. డిగ్రీ, ఇంటర్, ఐటిఐ పాస్ లేదా ఫెయిలైన విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ 3 నెలలు ఉంటుందని, అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు హబ్ కోఆర్డినేటర్ 7981541994 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

4న యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

యాదవ సామాజికవర్గం ప్రజల ఐక్యత, కులం అభివృద్ధి కోసం ఏప్రిల్ 4వ తేదీ యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. స్థానిక పాతఊరిలోని కాలమ్మ గుడి వద్ద శనివారం యాదవ కులస్తులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ 2008లో వేణు మాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఏప్రిల్ 4వ తేదీ ఎన్నుకునే కమిటీ సమావేశానికి మండలంలోని ప్రతి యాదవ కులస్తుడు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి.మహేష్, జిపి.నరసింహ, శివశంకర్, హరికృష్ణ, ఎజి. నరసింహులు, శ్రీనివాస్, ఉపేంద్ర, రమేష్, నాగరాజ్, రాజగోపాల్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

ఎస్సీ శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మండలంలోని పలు ఎస్సీ కాలనీలకు శ్మశానవాటికలు లేవని అందుకు తగిన స్థలాలు కేటాయిం చాలని కోరుతూ శనివారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఆంజనేయులు తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎనుములపల్లి, పెడపల్లి ఎస్సీ కాలనీలకు శ్మశానవాటిక స్థలం కేటాయించారే కానీ ఆ సర్వే నెంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కోరారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనమివ్వాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరుతూ శనివారం డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగంకు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సౌభాగ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనంతో పాటు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించాలని, ఎఎన్ఎంలుగా శిక్షణ పొందిన ఆశాలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, జిల్లా సహాయ కార్యదర్శి చెన్నకృష్ణమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ ద్వారా కూలీలను అన్ని రకాలుగా ఆదుకోవడానికి కృషి చేస్తామని టిడిపి బిసి సాధికారిక కుంచితి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప తెలిపారు. ఆయన శనివారం రొళ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఫారం పాండ్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కూలీలను ఆదుకోవడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టింద న్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, ఎపిఒ ఓబులప్ప, జేఈ మారేగౌడ్, టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు ఈరన్న, రామకృష్ణ, నాగరాజు, వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనులను ప్రారంభిస్తున్న పాండురంగప్ప

గుర్తు తెలియని శవం లభ్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని రేగాటిపల్లి గ్రామం నుంచి కేతిరెడ్డి కాలనీకి వెళ్లే మార్గంలో ఎడమ వైపున ఓ బీడు పొలంలో శనివారం స్థానిక రైతులు గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునిన మృతదేహాన్ని పరిశీలిం చారు. మహిళ గుండు చేయించుకుందని, 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉండవచ్చని తెలిపారు. ఆమె వివరాలు తెలిస్తే ధర్మవరం రూరల్ సిఐ 9440796832, ఎస్ఐ 9440796834 నెంబర్లుకు సమాచారం ఇవ్వాలని రూరల్ సిఐ ప్రభాకర్ తెలిపారు.

అంగన్వాడీలకు నియామక పత్రాలు అందజేత

అంగన్వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపి బికె పార్థసారథి, ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి మడకశిర

నిరుద్యోగ సమస్యను తీర్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఎంపి బికె.పార్థసారథి తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో శనివారం వారు అంగన్వాడీ, విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేశామన్నారు. అందులో భాగంగా 6 అంగన్వాడీ సెంటర్లకు, విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్లకు నియామక పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నాయకులు పాండురంగప్ప, డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, టిడిపి కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, గణేష్, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, జడ్పిటిసి ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా కేంద్రాల్లోసౌకర్యాల కల్పనపై హర్షం

మీసేవా కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించడం పట్ల ఎంపి బికె.పార్థసారథి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు హర్షం వ్యక్తం చేశారు. ముందుగా సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పట్టణంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ఎంపి, ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని ఆహ్వానించారు.

టిడిపి నేత మృతికి ఎమ్మెల్యే సంతాపం

మండలంలోని పాపసానిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు సుబ్బారెడ్డి తండ్రి శ్రీరామిరెడ్డి ఇటీవల మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే శనివారం ఆ గ్రామం వెళ్లి శ్రీరామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు ఉన్నారు.

పార్టీలకు అతీతంగా ఇళ్లు మంజూరు చేయాలి

నియోజకవర్గంలో దళితులకు ఇల్లు, శ్మశానవాటిక లేని గ్రామాలు ఉండకూడదని, వారితో పాటు బిసిలకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఐదు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, పొజిషన్ సర్టిఫికెట్లకు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు షేక్షావలి, కర్ణాకర్, ఎంపిడిఒలు రామారావు, సోనియాబాయి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పాండురంగప్ప, డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జడ్పిటిసి ఉమేష్, టిడిపి మండల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి : డిఇఒ

ప్రజాశక్తి-చిలమత్తూరు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని డిఇఓ క్రిష్టప్ప సూచించారు. ఆయన శనివారం స్థానిక శ్రీపొట్టిశ్రీరాములు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే విజయం సిద్ధిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయు లను ఆదేశించారు. అనంతరం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట డివైఈవో పద్మప్రియ, హెచ్‌ఎం వివేకానందమూర్తి, ఉపాధ్యాయులు రాఘ వేంద్ర, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులతో డిఈఓ క్రిష్టప్ప మొక్కలు నాటుతున్న డిఈఓ

లేపాక్షి : మండలంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాను డిఇఒ క్రిష్టప్ప తనిఖీ చేశారు. స్థానిక మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో డిఇఒ మాట్లాడుతూ పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాన్నారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఇఒ నాగరాజు నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వర్గీకరణతోనే ఎస్సీలకు రాజ్యాంగ ఫలాలు

ప్రజాశక్తి-హిందూపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఎస్సీల కోసం పొందుపరిచిన రాజ్యాంగ ఫలాలు ఎస్సీ వర్గీకరణ ద్వారా సాధ్యం అవుతాయని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సతీష్ కుమార్, ఆంజినేయులు, రామకష్ణ, ఆర్టీసీ బాబయ్య, రిటైర్డ్ ఎంఇఒ పెన్నయ్య, నాగార్జున, సుమోశీనా, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జల దినోత్సవం

ప్రజాశక్తి-నల్లచెరువు

ప్రపంచం జల దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీలో భాగంగా శనివారం మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, ఓరువాయి, మందలవండ్లపలి గ్రామాల్లో కంపోస్ట్ పిట్ పనులకు అరుణ రాజశేఖర్ భూమిపూజ చేశారు. ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా నీటి ప్రాముఖ్యతను వివరించారు. ఎండాకాలంలో ఆరుబయట నీరు ఉంచితే పశువులు, పక్షులు దాహం తీర్చుకుంటాయన్నారు. వారి వెంట కదిరి క్లస్టర్ ఎపిడి రమేష్ బాబు, ఎపిఒ మంజుల, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, జహీర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, భాస్కర్, వెంకటప్ప పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తచెరువు : విద్యార్థులు మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలని మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు భాస్కర్‌నాయుడు, నితీష్ చౌదరి సూచించారు. జల దినోత్సవం సందర్భంగా వారు కొత్తచెరువు గ్రామ సమీపంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్య త్తుకు బాట వేసుకోవాలని కోరారు. జన్మదినం, అభిమాన నాయకులు, సినీహీరోల పుట్టిన రోజున మొక్క లు నాటాలని సూచించారు. నీరు, చెట్ల ప్రాధాన్యతను వివరించారు.

మడకశిర : ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని మెళవాయి గ్రామంలో రైతు సుబ్బరాయప్ప పొలంలో ఉపాధి హామీ ద్వారా ఫారం పాండ్ నిర్మాణానికి మాజీ సర్పంచి నారాయణగౌడ్, సర్పంచి రంగనాథ్, ఎపిడి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంచుకోవడం కోసం నీటి నిల్వ కుంటల తవ్వకం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎపిఒ శ్రీకాంత్‌గౌడ్, నాగరాజు, మల్లికార్జున, గోవిందప్ప, రంగనాథ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.మరవపల్లి కెజిబివిలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగరత్న తెలిపారు. కెజిబివిలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 6వ తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

గాండ్లపెంట : మండలంలోని కటారుపల్లి కెజిబివిలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఒ దుర్గ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నల్లచెరువు : స్థానిక కెజిబివిలో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 22వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని స్పెషలాఫీసర్ శిరీష తెలిపారు. మరిన్ని వివరాలకు కెజిబివిలో సంప్రదించాలన్నారు.

గోరంట్ల : మండలంలోని మందలపల్లి కెజిబివిల 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శిరీష ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి 40, సీఈసీ గ్రూపులో 40 సీట్లు మాత్రమే ఖాళీలు ఉన్నాయన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు.

రాయితీతో వ్యవసాయ పనిముట్లు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందూపురం మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ తెలిపారు. ట్రాక్టర్ సంబంధిత పరికరాలు 23, పవర్ స్ప్రేయర్ 17, పవర్ వీడర్ 1, బ్యాటరీ స్ప్రేయర్ 7 పరికరాలు మండలానికి మంజూరు అయ్యాయన్నారు. అవసరమైన రైతులు రైతు సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

అక్రమ కట్టడాలను కూలుస్తాం

◆ అది చేయొద్దు.. ఇది చేయొద్దంటూ చేతులు కట్టేయొద్దు ◆ మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలని కూల్చివేస్తామని, ఇందులో ఎలాంటి సందేహం లేదని మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఉదయం తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయానికి అనంతపురం ఆర్డీవో కేశవనాయుడు వచ్చారన్న సమాచారంతో ప్రభాకర్‌రెడ్డి అక్కడికెళ్లారు. అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తాడిపత్రి పట్టణంలో వైసిపి నాయకులు చేపట్టిన అక్రమ కట్టడాలపై ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం జెసి నివాసంలో ప్రభాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకుడు రమేష్ రెడ్డి, మైనారిటీ నాయకుడు ఫయాజ్ బాషా, గాంధీ కట్ట సమీపంలోని అంబటి రాఘవ రెడ్డి, పుట్లూరు రోడ్డులో ఆకుల నాగిరెడ్డి భవన నిర్మాణాలు మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని చెప్పారు. వాటన్నింటిని చట్ట ప్రకారం తొలగిస్తామని తెలియజేశారు. నిబంధనలను పాటిస్తూనే వీటిని తొలగిస్తామన్నారు. ఫయాజ్ బాషాకు పలుమార్లు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా ఆయన నుంచి స్పందన లేదన్నారు. ఆయన స్పందించకపోవడంతోనే శుక్రవారం తాను ఫయాజ్ బాషా ఇంటి వద్దకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. తాను అక్కడికి వెళ్లకపోతే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. శుక్రవారం నాడు తాడిపత్రిలో జరిగిన ఘర్షణ పోలీసుల వైఫల్యంతోనే జరిగిందన్నారు. మున్సిపాల్టీలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేబడితే అధికారులు చూస్తూ ఊరుకోరన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తాడిపత్రిలో ఫ్యాక్షన్ చేస్తానన్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎక్కిడికి వెళ్లారని ప్రశ్నించారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

కోమటికుంట్లలో 45 ఎకరాలు భూములు కొట్టేసిన చరిత్ర మాజీ ఎమ్మెల్యేది అన్నారు. ఆ వ్యవహారాన్ని బట్టబయలు చేస్తానన్నారు. సోమవారం నుంచి ఎవరెవరు అక్రమ నిర్మాణాలు చేపట్టారో వారందరి కట్టడాలను నిబంధనలు మేరకు కూల్చివేస్తామన్నారు.

'చేతులు కట్టేయద్దు'

ప్రతిపక్షంలో ఉండగా తాను, తన కుమారుడు ఎన్నో ఇబ్బందులు పడ్డాం.. ఇప్పుడు అధికారంలో ఉండి అది చేయకూడదు.. ఇది చేయకూడదు అంటూ పైనుంచి తమ చేతులు కట్టేయద్దంటూ ప్రభాకర్‌రెడ్డి అధిష్టానాన్ని కోరారు. ఇకపై ఎవరి మాట వినమన్నారు. తాను, తన కుమారుడు జైలు గోడల మధ్య గడిపిన జీవితం గుర్తుకు తెచ్చుకుంటే ఆ పరిస్థితి జీవితంలో ఎవరికీ రాకూడదని అనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి అది చేయకు.. ఇది చేయకు అని అధిష్టానం సూచించవద్దని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీటిని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

భూసేకరణపై గ్రామసభలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలో నేషనల్ హైవే 342 ఏర్పాటులో భాగంగా భూసేకరణపై శనివారం అధికారులు అగ్రహారం, పాముదుర్తి, గూనిపల్లి, బుచ్చయ్యగారిపల్లి గ్రామాలల్లో గ్రామసభలు నిర్వహించారు. భూ సేకరణ జరిగే సర్వేనెంబర్లు, రైతుల వివరాలు, ఎంత మేర భూమి కోల్పోతారు, నష్టపరిహారం, తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు అభ్యంతరాలు, సమస్యలు ఉంటే తెలపాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షాబుద్దీన్, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, వీఆర్వోలు శిరీష, లక్ష్మినారాయణ, పెద్దన్న, బాలసుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతి సొమ్ము రికవరీకి ఆదేశం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలో శనివారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అధికారులు 18వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. రూ. 15 కోట్ల ఉపాధి హామీ పనులకు గానూ రూ. 7.42 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్‌రెడ్డి, బిజెపి మండల కన్వీనర్ అంజన్‌రెడ్డి, ప్రెసిడింగ్ ఆఫీసర్ శివశంకర్, ఎపిడి వెంకటాచలపతి, వెంకటశివారెడ్డి, ఎవిఒ నాగేశ్వరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ దివాకర్, పంచాయతీ సెక్రటరీ మంజుల, ఎపిఒ రమణారెడ్డి, మండలంలోని ఇంజినీరింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.